
చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు


అనంతపురం నగరంలో వెలసిన ఫ్లెక్సీలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సూపరో సూపర్..!

హిట్ కొట్టేందుకు శరవేగంగా ఏర్పాట్లు

- అనంతలో తిష్టవేసిన మంత్రులు, నాయకులు
- భద్రతపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సమీక్ష
- నేడు జిల్లాకు చేరనున్న కూటమి కీలక నాయకులు
- మూడు పార్టీల జెండాలు.. ఫ్లెక్సీలతో స్వాగత ఏర్పాట్లు
- నేటి నుంచి పోలీసుల నిఘా నీడలోకి అనంతపురం
- రేపు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ విజయోత్సవ సభ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహా సంరంభానికి అనంత వేదిక కాబోతోంది. మరో 24 గంటల్లో.. 15 నెలల కూటమి ప్రభుత్వం అందించిన 'ప్రజల కలల ఫలాల' విజయోత్సవం జరగబోతోంది. రాష్ట్ర ప్రగతి రథసారథి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కీలక నాయకులకు ఆతిథ్యం ఇచ్చేందుకు అనంత సిద్ధమైంది. 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరిట బుధవారం జరిగే ఈ వేడుకకు అనంత వీధులన్నీ ముస్తాబయ్యాయి. నగర వ్యాప్తంగా కూటమి పార్టీల జెండాలు కలిసి రెపరెపలాడుతున్నాయి. తమ ప్రియతమ నాయకులకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బెలూన్లతో తోరణాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పది మందికి పైగా మంత్రులు, 30 మంది వరకూ ఎమ్మెల్యేలు, 5 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలో వాలిపోయారు. పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మూడు పార్టీల నాయకులు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీజీపీ, మంత్రులు నారాయణ, కేశవ్, అనగాని

మంగళవారం అనంతకు చేరుకోనున్నారు. బహిరంగ వేదిక, గ్యాలరీలు, హెలీప్యాడ్‌లు, భద్రతా ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.

సందడే సందడి..

సూపర్ సిక్స్-సూపర్ హిట్ కోసం వచ్చినవారితో అనంతపురం నగరంలో సందడి నెలకొంది. ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల ఎమ్మెల్యే, కీలక నాయకులు ఇక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కొందరు క్షేత్రస్థాయిలో పర్యటించి.. ప్రజలను ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గాలవారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేలా చైతన్యపరుస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ, బీజేపీ, జనసేన రాష్ట్ర నాయకుల వెంట వచ్చిన వారితో నగరం కిటకిటలాడుతోంది. అనంతపురం నగరం, సమీప ప్రాంతాలలోని హోటళ్లు, లాడ్జిల గదులన్నీ ఇప్పటికే బుక్ అయ్యాయి. నగరంలోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు సైతం ముందే బుక్ అయ్యాయి. సుమారు 25 మంది వరకూ మంత్రులు మంగళవారం సాయంత్రానికి అనంతపురం వచ్చే అవకాశం ఉంది.

శరవేగంగా ఏర్పాట్లు

శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో సభకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. సభావేదిక పూర్తిగా సిద్ధమైంది. అన్ని గ్యాలరీలను సిద్ధం చేశారు. వేదిక వెనుక వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, యువనేత లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విశ్రాంతి కోసం ప్రత్యేక టెంట్‌లను సిద్ధం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల కోసం మరో టెంట్‌ను సిద్ధం చేశారు. మొత్తం వేదిక, గ్యాలరీలు, అనంతపురం నగరంలోని ట్రాఫిక్, సెక్యూరిటీ, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో భద్రతను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక టెంట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. సభా వేదిక వైపు వెళ్లే శ్రీనగర్ పాలనీ, రాంనగర్ ఫ్లై ఓవర్, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, బళ్లారి, రుద్రంపేట బైపాస్ ప్రధాన రహదారులు, నగరంలోని అన్ని ప్రధాన రహదారులు, సర్కిళ్లు మూడు పార్టీల జెండాలు, ఫ్లెక్సీలతో నగరానికి కొత్తశోభ సంతరించుకుంది.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు

6

అప్రమత్తంగా ఉండండి

- ఐపీఎస్‌లకు డీజీపీ ఆదేశం



వేలాది మంది పోలీసులు

సీఎం సహా కీలక ప్రజా ప్రతినిధులు, మూడు పార్టీల నాయకులు వస్తుండటంతో అనంతలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా రెండు రోజుల ముందే నగరానికి చేరుకుని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఐజీ, డీఐజీల సహా 30 మందికి పైగా ఐపీఎస్ అధికారులు, సుమారు 6 వేల మంది వరకూ పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. సభా ప్రాంగణం, హెలీప్యాడ్‌ల సహా నగరం మొత్తం మంగళవారం నుంచి పోలీసు శాఖ నిఘా నీడలోకి వెళ్లనుంది.

బీసీల చదువు పట్ల జగన్ నిర్లక్ష్యం

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

110 గురుకులాల్లో స్మార్ట్ పే ఫోన్లు


గోరంట్ల విద్యార్థి రోహిత్ తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థుల చదువు, హాస్టళ్ల పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్లక్ష్యం వహించారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆరోపించారు. పెనుకొండలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నరసింహారావుతో కలిసి ఆమె సోమవారం స్మార్ట్ పేఫోన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బీసీ బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో దివంగత ఎన్టీఆర్ రాష్ట్రంలో గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నాంది పలికారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆ వారసత్వంగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాస్టళ్లలోని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడుకునే

(మిగతా 6లో...)

సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో జిల్లా కేంద్రానికి వచ్చి, ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ ప్రజల నుంచి 233 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళ స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్) 108 అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీఓ క్రిష్ణనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

జిల్లాలో పంటలు సాగుచేసిన రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌లో వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికి సాధారణం కంటే 60.2 మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదయిందని వివరించారు. జిల్లాలో 45వేల హెక్టార్లలో వేరుశనగ, 15వేల హెక్టార్లలో మొక్కజొన్న, 16వేల హెక్టార్లలో రాగి, 4వేల హెక్టార్లలో వరి పంటలు సాగుచేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాకు 5,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని అన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల్లో 500 మెట్రిక్ టన్నులు, క్షేత్రస్థాయిలో 280 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 300 మెట్రిక్ టన్నులు యూరియా నిలువ ఉన్నట్లు వివరించారు. రైతులు ఈనెల 30లోపు ఈక్రాప్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

తుది దశకు..!

- పూర్తి కావస్తున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- డ్యుయల్ పోస్టుల స్థానంలో మరొకరికి అవకాశం
- నేడో.. రేపో కాల్ లెటర్లు
- ఆ తర్వాత కటాఫ్‌తో జాబితా

7


శివతాండవం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

చిన్నారుల శివతాండవం

పుట్టపర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారు లు చేపట్టిన శివతాండవం భక్తులను అలరించింది. రెండోరోజు సోమవారం కాంచీపురం భక్తులు సాయికుల్వంతులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు శివపురాణంలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శిస్తూ చేసిన శివతాండవ నృత్యం భక్తులను తన్మయం చేసింది. అనంత రం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

'సూపర్‌హిట్' చేయాలి: చిలకం

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న నిర్వహించే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ కార్యక్రమ విజయవంతాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా తీసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సభ విజయ వంతానికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక జనసేన పార్టీ కార్యాల యంలో నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న సందర్భంగా అనంతపురంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నారని, దాన్ని విజయవంతం చేయడానికి ప్రతినాయకుడు కృషి చేయాలన్నారు. ప్రతినాయకుడు వార్డులు, గ్రామాలలో ప్రజలను చైతన్యవంతులు చేసి సభకు తీసుకురావాలన్నారు. గత ఐదేళ్లలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి వల్ల బాగవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, బెస్త శ్రీనివాసులు, అడ్డగిరిశ్యాం, సరితాల బాషా, సరితాల దస్తగిరి, తోపుదుర్తి వెంకటరాముడు, బాలకృష్ణలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

మరో నలుగురికి పదవులు


హేమలత


మనోహర్ నాయుడు


రాళ్లపల్లి షరీఫ్

పుట్టపర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మరో నలుగురు టీడీపీ నేతలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. రాష్ట్రస్థాయి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టర్లుగా హిందూపురం నుంచి మోతకపల్లి చంద్రమోహన్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గం నుంచి ముదిగుబ్బ మండలం రామస్వామి తండాకు చెందిన కనవత్ హేమలతను నియమించారు. ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కదిరికి చెందిన బండారు మనోహర్ నాయుడు నియమితుడయ్యారు. రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధర్మవరం వాసి రాళ్లపల్లి షరీఫ్‌ను నియమించారు.

ప్రాణం తీసిన ప్రశ్న

- తిండి గింజలు అమ్ముకుంటావా అని ప్రశ్నించిన భార్య
- గొడ్డలితో నరికి చంపిన భర్త

7


యాడికిలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసుకున్న దిమ్మె

ఏళ్ల ఎదురుచూపులు..!

కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ

- ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులకు తప్పని తిప్పలు
- ఆమ్యామ్యాలు ముట్టజెబితేనే అంచనాలు
- డీడీలు తీసి.. ఏళ్లు గడుస్తున్నా.. మంజూరు కాని దుస్థితి..
- ఆరు వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్

కరువు రైతు.. ఇన్నాళ్లకు నీళ్లు చూస్తున్నాడు..
హంద్రీనీవా కాలువ నీటితో చెరువులు నిండాయి..
బోరుబావులు తవ్వుకుని.. పంటలు పండించుకుని..
అప్పుల నుంచి బయటపడదామని ఆశిస్తున్నాడు..
మరింత అప్పు చేసి.. బోర్లు వేయిస్తున్నాడు..
మోటారు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకున్నాడు..
విద్యుత్ కనెక్షన్ ఇస్తే.. పంట పెట్టుకుంటాడు..
ఇందుకోసం డీడీ తీసి.. ఎదురుచూస్తున్నాడు..

పంట పెట్టుబడుల కోసం చేసిన పాత అప్పులు..
బోరుబావి తవ్వకానికి.. ట్రాన్స్‌ఫార్మర్ డీడీ కోసం
చేసిన కొత్త రుణాలు..
మోపెడయ్యాయి.. వడ్డీలు భారమవుతున్నాయి..
అయ్యా.. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి..
విద్యుత్ కనెక్షన్ ఇస్తే.. పంటలు పండించుకుంటానని
అధికారులను వేడుకుంటున్నాడు..
ఎవ్వరూ వినరు.. కరువు రైతు ఏ ఒక్కరూ పట్టించుకోరు..



ధర్మవరం రూరల్/యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులు, అంచనాలు వేయించుకుని డబ్బులు చెల్లించి ఏళ్ల గడుస్తున్నా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కావట్లేదు. పంట పండించుకునేందుకు నీళ్ల ఉన్నా.. వాటిని వినియోగించుకునే పరిస్థితి లేదని జిల్లాలోని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా 70శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు.. భూములను బీళ్లుగా పెట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కాళ్లరిగేలా తిరిగినా అధికారుల నుంచి స్పందన లేదు. దీంతో పంటలు పెట్టుకోలేమనే ఆందోళన రైతుల్లో నెలకొంది. 'ఎప్పుడొస్తాయో.. చెప్పండి సార్..' అంటూ అధికారుల వద్ద మొర పెట్టుకున్నా.. వారి నుంచి తమకే తెలియదనీ, దరఖాస్తులు ఉన్నతాధికారులకు పంపామని చెప్పి, తప్పించుకుంటున్నారు. డీడీలు చెల్లించకుండా ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణ చేస్తున్నా.. అధికారులు కనీస కనికరం చూపలేదని పలువురు రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు బోర్లు వేసుకుని, పంటలు పండించుకోవాలని భావిస్తున్నారు. నీరు పుష్కలంగా

(మిగతా 6లో...)

సూపర్ హిట్‌ను విజయవంతం చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల10న కూటమి ప్రభుత్వం నిర్వహించే సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ సూపర్‌హిట్ చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం ఆర్థికంగా నాశనం అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, ప్రధాని మోదీ మద్దతుతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చక్కగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, ప్రొటోకాల్ ఇన్‌చార్జి పాతూరు నాగభూషణ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోకొరెడ్డి, శ్రీదేవి, సీనియర్ నాయకులు రత్నమయ్య, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు మారుతిగోవిందు, కార్యదర్శి పోగుల నాగేంద్ర, ఐటీ సెల్ కన్వీనర్ భీమశేఖర్, మైనార్టీ మోర్చా రఫీ, చక్రధర్‌యాదవ్, ఓబీసీ నాగేంద్ర పాల్గొన్నారు.

సభను జయప్రదం చేద్దాం: వరుణ్



నాయకులతో చర్చిస్తున్న టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభను జయప్రదం చేద్దామని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సభ విజయవంతానికి జన సైనికులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సురేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, సీనియర్ నాయకులు లక్ష్మీపతి, పత్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు 3,550 బస్సులు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు తరలివచ్చే ప్రజల కోసం భారీగా బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జూన్-3, జోన్-4 నుంచి సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభకు ఆర్టీసీ బస్సులు 3050 అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జోన్-4 నుంచి 2,300, జోన్-3 నుంచి 750 బస్సులు వస్తాయన్నారు. మరో 500 వరకూ ప్రైవేటు బస్సులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ 3,050 బస్సులను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 13 నియోజకవర్గాల నుంచీ సభకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి 180, ఉరవకొండ 300, గుంతకల్లు 300, తాడిపత్రి 240, శింగనమల 450, కళ్యాణదుర్గం 240, రాప్తాడు 450, మడకశిర 80, హిందూపురం 80, పెనుకొండ 180, పుట్టపర్తి 125, ధర్మవరం 300, కదిరికి 125 బస్సులు పంపుతామన్నారు. ప్రైవేటు బస్సుల్లో అనంతపురం అర్బన్‌లో 400, మడకశిరకు 50, పుట్టపర్తికి 50 అందుబాటులో ఉంచుతున్నట్టు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు.

85 లక్షల టన్నుల చెత్తే జగన్ ఘనత

- మంత్రి నారాయణ



డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పన్ను వసూలు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా 85లక్షల టన్నుల చెత్తను వదిలేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గుత్తిరోడ్డులోని డంపింగ్‌యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. బయోమైనింగ్ ఇంజనీర్లు, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లను అడిగి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల అప్పులతో పాటు, 85లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిందని విమర్శించారు. బయోమైనింగ్ ప్రారంభించిన నెల రోజుల్లోనే 60శాతం చెత్తను తరలించామని తెలిపారు. వైసీపీ పాలనలో కేంద్రం ప్రవేశపెట్టిన అమృత్ పథకం కింద రాష్ట్రానికి రూ.8800కోట్లు నిధులు వచ్చినప్పటికీ, రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో అవి వెనక్కివెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ వైసీపీ వేసిన చెత్తను తరలించే ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో ఆరు క్రష్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 30ఏళ్లుగా పేరుకుపోయిన 2లక్షల టన్నుల చెత్తతో నిండిన డంపింగ్ యార్డు సమస్యకు సీఎం చంద్రబాబు పరిష్కారమార్గం చూపారని....అర్బన్ నియోజకవర్గంలోని ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, ఏఎంసీ ఈఈ షాకీర్, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.15, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



ఆకాశమంత పందిరి కింద.. అనంత నేలపై 'సూపర్ హిట్' అరుగు

విచ్చేయండి.. అనంతకు..!



రండి రండి రండి..! తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ..!

అప్రమత్తంగా ఉండండి: డీజీపీ



మాట్లాడుతున్న డీజీపీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటన, సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ, ప్రముఖుల పర్యటన నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీలు, డీఐజీలు, ఐపీఎస్‌లతో కలిసి భద్రతపై సమీక్షించారు. సీఎం టూర్ సభాస్థలి వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాల్లో బందోబస్తు, హైవేపై ట్రాఫిక్ మళ్లింపు, సీసీ కెమెరాల పనితీరు, డోన్స్ నిఘా తదితర అంశాలపై జిల్లా ఎస్పీ జగదీష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఐపీఎస్‌లను ఆదేశించారు. విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, ప్రజలు వస్తారని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఐజీ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఇతర డీఐజీలు సెంథిల్ కుమార్, కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, అమ్మిరెడ్డి, విజయరావు, సత్యఏసుబాబు, పక్కీరప్ప, అన్బురాజన్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ఇతర ఎస్పీలు, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజు ఇంట నాయకుల సందడి



మంత్రులు, నాయకుల 'సక్సెస్' సన్నాహక మీట్



సభ ఏర్పాట్లపై మంత్రి, ఎమ్మెల్యేల సమాలోచన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇంట సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఇతర మంత్రులు సందడి చేశారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నేపథ్యంలో జిల్లాకు వచ్చిన పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు వెంకటరాజు, పులివర్తి నాని, పల్లె సింధూర, జయనాగేశ్వర్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వప్రసాద్, పరిటాల సునీత, అశోకొరెడ్డి, ఆనంద బాబు, బండారుశ్రావణి, పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, కార్పొరేషన్ల చైర్మన్లు వీరాంజనేయులు, రవినాయుడు, సత్య ఆయన ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన అధ్యక్షుడు, అమాత్యులు, అతిథులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. విందు తర్వాత సీఎం కార్యక్రమం విజయవంతంపై చర్చించారు.


చరిత్రలో నిలిచిపోతుంది: కేశవ్



అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సభా వేదిక పనులను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలన్నింటినీ నెరవేర్చిందని అన్నారు. సభకు రావాలని టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిలుస్తున్నారని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సభను విజయవంతం చేయడానికి జనసేన, బీజేపీ, టీడీపీ కలసి పనిచేస్తున్నాయని అన్నారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు జిల్లాకు లైఫ్‌లైన్‌గా నిలిచే హంద్రీనీవా ప్రాజక్టును 100 రోజుల్లో పూర్తిచేశామని అన్నారు. హంద్రీనీవా కాలవను విస్తరించి, రెట్టింపు నీటిని తీసుకురావడంతో జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని అన్నారు. కడపలో జరిగిన మహానాడు సభ అద్భుతం అనుకుంటే.. అంతకు మించి కళకళలాడేలా ఏర్పాట్లు అనంతలో జరుగుతున్నాయని అన్నారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు



పోలీసు శాఖ విడుదల చేసిన హైదరాబాద్ నుంచి బెంగళూరు రూట్ మ్యాప్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్పీ జగదీష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంక్షలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. హైదరాబాద్ నుంచీ బెంగళూరు వైపు వెళ్లే వాహనదారులు అనంతపురం నగరం నుంచి కాకుండా వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, నార్పల క్రాస్, బత్తలపల్లి, ధర్మవరం, ఎన్ఎస్ గేట్ మీదుగా నేషనల్ హైవే 44 మార్గంలో వెళ్లాలన్నారు. కర్నూలు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనదారులు వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, బత్తలపల్లి, కదిరి, మదనపల్లె మార్గంలో వెళ్లాలని సూచించారు. బళ్లారి నుంచీ బెంగళూరు వెళ్లే వాహనదారులు చెళ్లికెర, తుంకూరు, నెలమంగళ, బెంగళూరు మార్గంలో ప్రయాణించాలని సూచించారు. బెంగళూరు నుంచీ హైదరాబాద్ వెళ్లే వాహనదారులు బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్, బుక్కరాయసముద్రం, వడియంపేట, నేషనల్ హైవే 44 రహదారిలోకి చేరి ప్రయాణించాలన్నారు. తిరుపతి, చెన్నై నుంచి కర్నూలు వెళ్లాలనుకునే వాహనదారులు కదిరి, బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్ మీదుగా బుక్కరాయసముద్రం వచ్చి వడయంపేట మీదుగా నేషనల్ హైవే 44 చేరుకుని కర్నూలు వెళ్లాలని సూచించారు. బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు సైతం అనంతపురం రాకుండా నెలమంగళ, తుంకూరు, చెళ్లికెర మార్గంలో వెళ్లాలని ఎస్పీ సూచించారు.



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఎస్పీ

సభకు ముమ్మర ఏర్పాట్లు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం నగరంలోని అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలో టాటా మోటార్స్ ఎదురుగానున్న స్థలంలో ఏర్పాటు చేస్తున్న రెండు హెలీప్యాడ్లలో ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ జగదీష్, జేసీ శివ నారాయణ శర్మ, సీఎం భద్రతాధికారులు పరిశీలించారు. అనంతరం శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ గ్రౌండ్స్ వద్ద నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, సీఎం పర్యటన కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సభకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టామన్నారు. అంబులెన్స్‌ల ఏర్పాటు, ఆస్పత్రికి వెళ్లే దారుల్లో ఇబ్బంది ఉండదన్నారు. మంగళవారం కాన్వాయ్ రిహార్సల్స్ ట్రయల్ ల్యాండింగ్ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

అధికారులు ప్రణాళికతో వ్యవహరించాలి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులంతా ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలన్నారు. సభలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలు ఏం చేయాలి, ఏం చేయకూడదనేది అందరికీ తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీంబాషా, మెప్మా పీడీ విశ్వజ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఏళ్ల ఎదురుచూపులు..!

(5వ పేజీ తరువాయి)

పడినప్పటికీ వాటికి విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన దరఖాస్తులకు సంబంధించి అధికారులు కనీసం అంచనాలు వేసేందుకు కూడా రాలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతుల పాలిట ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు శాపంగా మారింది.

6 వేలకుపైగా దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీటిలో 3 వేలకుపైగా డీడీలు తీశారు. ట్రాన్స్‌ఫార్మర్లు అందక రైతులు ఆయా మండలాల్లోని విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంచనాలు వేయడంలో లైన్‌మెన్ నిర్లక్ష్యం

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటారు. వారికి అవసరమైన పరికరాల కోసం పొలాల వద్దకు లైన్‌మెన్ వెళ్లి అంచనాలు తయారు చేయాల్సి ఉంటుంది. లైన్‌మెన్‌ను రైతులు ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అంచనాలు వేయాలని ఎంత వేడుకున్నా వారు కనికరించడం లేదని వాపోతున్నారు. కొంతమంది లైన్‌మెన్ ఆమ్యామ్యాలు ఇస్తేనే అంచనాలు వేస్తామని తెగేసి చెబుతున్నారని తెలుస్తోంది.



ధర్మవరం మండలం ఏలుకుంట్ల వద్ద విద్యుత్ సరఫరా లేక నీరు రాలేదని చూపుతున్న సాకే మల్లేష్

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా

నాకు ఐదెకరాల భూమి ఉంది. రెండేళ్లక్రితం బోరుబావి తవ్వించా. మొదట్లో పక్క రైతులతో కరెంట్ కనెక్షన్ తీసుకుని మామిడి పంట సాగుచేశా. వారు కనెక్షన్ తీసేయడంతో బోరులో నీరు ఉన్నా.. పంటలు సాగుచేసుకోలేకపోతున్నా. ప్రస్తుతం వర్షపు నీటితోనే మామిడి చెట్లను కాపాడుకుంటున్నా. ఎండాకాలంలో ట్యాంకుల ద్వారా తడులు ఇస్తున్నా. రెండేళ్లుగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నా.

- సాకే మల్లేష్, ఏలుకుంట్ల గ్రామం, ధర్మవరం

రైతులందరికీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తాం

దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తాం. డీడీలు తీసిన ఆయా రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తాం. మిగతా రైతులకు మంజూరు కాగానే అందజేస్తాం. వీటిపై ఎవరూ ఆందోళన చెందవద్దు.

- సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ, శ్రీసత్యసాయి జిల్లా

అధికారుల బాగోతం బయటపెడతాం..

ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖలో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అందరికీ ముడుపులు ముట్టజెప్పామనీ, అయినా మంజూరు చేయట్లేదని యాడికికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. వారి బాగోతం బయటపెడతామని హెచ్చరిస్తున్నారు. మండలంలో 200మంది రైతులకుపైగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. రైతుల జాబితాను ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పాటుచేశారు. జాబితాలో సీనియారిటీ పేరుతో రైతులను ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఓపిక నశించిన రైతులు ట్రాన్స్‌కో అధికారులతో పలుమార్లు వాగ్వాదాలకు దిగారు కూడా. అయినా ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు వస్తే.. మెటీరియల్ లేదనీ, మెటీరీయల్ వస్తే ట్రాన్స్‌ఫార్మర్లు లేవని సాకులు చెప్పి.. రైతుల ఆగ్రహానికి గురవుతున్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం అయినా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తారా అంటే అదీ లేదు. పలుకుబడి, రాజకీయ నాయకుల అండదండలు, మామూళ్లు ఇచ్చుకునే రైతులకు మాత్రం నెలరోజుల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నారు. ఇవేవీ లేని సామాన్య రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. అధికారులు అడిగినంత ముడుపులు ముట్టజెప్పినా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



ఏడాదిన్నరగా ఎదురుచూపులే..

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం డబ్బులు కట్టి ఏడాదిన్నర అవుతోంది. అప్పుడు ఇస్తాం.. ఇప్పుడు ఇస్తాం.. అంటూ కాలయాపన చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే పంటలు సాగుచేస్తామని ఎదురుచూస్తున్నా. ఏడాదిన్నరగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకపోవడంతో పొలాన్ని బీడుగా పెట్టుకోవాల్సి వచ్చింది. ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

- భాస్కర్‌రెడ్డి, రైతు యాడికి

డబ్బులు కట్టి రెండేళ్లవుతోంది

ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులు కట్టి రెండేళ్లవుతోంది. ఇంతవరకు మంజూరు చేయలేదు. ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యంతో పొలాలను బీడుగా పెట్టుకోవాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

- నారాయణరెడ్డి, రైతు, గుడిసెలు గ్రామం, యాడికి మండలం

బీసీల పట్ల జగన్ నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

విధంగా స్మార్ట్ పేఫోన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 110గురుకులాల్లో 700స్మార్ట్ పేఫోన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు స్మార్ట్ పే ఫోన్ ద్వారా ఫోన్ చేసి మాట్లాడారు.

ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఆరోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ సమీపంలో అరకొరగా పనులు జరిగి, ఆగిపోయిన వైద్య కళాశాలను మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్, మాజీ మంత్రులు వైద్య కళాశాలలపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 10న సూపర్ సిక్స్- సూపర్‌హిట్ కార్యక్రమాన్ని అనంతపురంలో పెద్దఎత్తున చేపడుతుండటాన్ని జీర్ణించుకోలేని జగన్ అండ్‌కో తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రూ.8,480కోట్లతో 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తామని 2020లో జగన్ డబ్బా కొట్టాడన్నారు. అయితే నాబార్డ్, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2125కోట్ల నిధులను ఐదు వైద్య కళాశాలలకు ఖర్చు చేశాడని ఆరోపించారు. ఇంకా రూ.674కోట్లు బకాయిలు పెట్టి, భవన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశాడని విమర్శించారు. మిగిలిన కళాశాలల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలను పీపీపీ మోడల్‌లో నిర్మించాలని నిర్ణయించిందని, దీనిపై జగన్ తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామకృష్ణప్ప, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, గుట్టూరు సూరీ, మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, త్రివేంద్ర, ఎగువగడ్డ కృష్ణమూర్తి, షౌకత్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

బాబును చూసి బుద్ధి తెచ్చుకో: మంత్రి సవిత

రొద్దం, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తున్నారో చూసి.. బుద్ధి తెచ్చుకోవాలని మాజీ సీఎం జగన్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత విమర్శించారు. మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు, పరిశీలకుడు నరసింహారావు సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం పది లక్షల కోట్ల అప్పులిచ్చినా.. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఈనెల 10న అనంతపురంలో నిర్వహించే సూపర్‌సిక్స్, సూపర్‌హిట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. మండలం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని సవిత కోరారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 432 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా ఇంటర్ విద్యార్థి మృతి

- నంద్యాల జిల్లా డోన్ వసతి గృహంలో ఘటన
- విద్యార్థి యాడికి వాసి


శ్యాంసుందర్ (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యాడికికి చెందిన ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ (16) ప్రభుత్వ వసతి గృహంలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం నంద్యాల జిల్లా డోన్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని చౌడేశ్వరికాలనీకి చెందిన రమేష్, సావిత్రి దంపతులు చేనేత వృత్తిద్వారా జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్యాంసుందర్ నంద్యాల జిల్లా డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. సెలవులు అని ఇంటికి వచ్చిన శ్యాంసుందర్ ఇంటివద్ద మగ్గం పనులు చురుకుగా చేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం డోన్‌కు వెళ్లాడు. రాత్రి 7గంటల సమయంలో కూడా తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో శ్యాంసుందర్ ఉంటున్న హాస్టల్ నుంచి ఫోన్ వచ్చింది. శ్యాంసుందర్ హాస్టల్‌లోనే ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన డోన్‌కు వెళ్లారు. ఉరివేసుకున్న శ్యాంసుందర్ మృతదేహాన్ని పరిశీలించి తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్యాంసుందర్ మృతదేహాన్ని యాడికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.


విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

కృష్ణాపురంలో యువకుడు..


వేణు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వేణు (26) అనే యువకుడు అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమారుడు వేణుకు ఆరు సంవత్సరాలు క్రితం మర్తాడు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమార్తె లక్ష్మితో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. వేణు, లక్ష్మి తరుచు గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే మర్తాడులో కాపురం పెట్టారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పది రోజుల క్రితం దంపతులు గొడవ పడ్డారు. దీంతో వేణు కుమారుడిని తీసుకుని కృష్ణాపురం వెళ్లాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మి కూడా కుటుంబ సభ్యులతో కలసి కృష్ణాపురం వెళ్లింది. అ సమయంలో వేణు గ్రామంలో లేకపోవడంతో లక్ష్మి కుమారుడిని తీసుకుని మర్తాడుకు వెళ్లింది. రాత్రి ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో వేణుకు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తాను ఆలస్యంగా వస్తానని చెప్పాడు. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూడగ వేణు ఇంటి ముందు వేసిన షెడ్డులో లుంగీతో ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల వారి సాయంతో వేణును కిందకు దింపగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన ప్రశ్న

- తిండి గింజలు అమ్ముకుంటావా అని ప్రశ్నించిన భార్య
- గొడ్డలితో నరికి చంపిన భర్త


లక్ష్మిదేవి (ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న తిండి గింజలు అమ్ముకొని తాగేశావా అని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి తన భార్యను ఆదివారం రాత్రి గొడ్డలితో నరికి చంపాడు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాఘవేంద్ర, లక్ష్మిదేవి(30)లు నివాసమున్నారు. వీరికి శృతి అనే కుమార్తె ఉంది. రాఘవేంద్ర కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్త జులాయిగా తిరుగుతుండటంతో లక్ష్మిదేవి కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళ్లేది. ఈక్రమంలో ఆదివారం ఆమె పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో నిల్వ ఉంచిన 50 కిలోల బియ్యాన్ని రాఘవేంద్ర ఎత్తుకెళ్లి అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కూలి పని నుంచి వచ్చిన లక్ష్మిదేవి ఇంట్లో బియ్యం కనపడకపోవడంతో భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహం చెందిన రాఘవేంద్ర రాత్రి 10 గంటల పైన నిద్రపోతున్న లక్ష్మిదేవిని గొడ్డలితో నరికాడు. ఆమె రక్తపు మడుగులో పడి ఉండటం చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మిదేవిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం-3లో (65) సంవత్సరాల గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9866144616 నంబరులో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుది దశకు..!

- పూర్తి కావస్తున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- డ్యూయెల్ పోస్టుల స్థానంలో మరొకరికి అవకాశం
- నేడో.. రేపో.. కాల్ లెటర్లు..


డీఎస్సీ అర్హత జాబితాను సరిచూస్తున్న ఐటీ విభాగ సిబ్బంది

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 15 రోజుల క్రితం మెరిట్ లిస్టు ఇచ్చారు. ఇప్పటి వరకు 807 టీచర్ పోస్టులకుగాను 773 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపారు. అర్హత కలిగిన ఏ ఒక్క అభ్యర్థీ నష్టపోకూడదని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. బోగస్‌ల ఏరివేతకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయించి, పక్కాగా పరిశీలింపజేస్తున్నారు. అదే అభ్యర్థుల సర్టిఫికెట్లను నాలుగుసార్లు ప్రత్యేక కమిటీలతో పరిశీలన చేయించారు. ఒకటి నుంచి మూడో దఫా వరకు అక్కడక్కడా అభ్యర్థుల సర్టిఫికెట్లపై రిమార్కులు బయటపడుతూ వచ్చాయి. దీంతో సోమవారం నాలుగోసారి ఆ సర్టిఫికెట్లను ఇతర కమిటీలతో పరిశీలన చేయించారు. అందులో ఒక్క రిమార్క్ కూడా రాలేదని వెరిఫికేషన్ బృందాలతోపాటు విద్యాశాఖ అధికారవర్గాలు తెలిపాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

త్వరలో ఎంపిక జాబితా?

టీచర్ల నియామకాల పక్రియను రాష్ట్ర శాఖ చేపడుతోంది. మెరిట్ ఆధారంగా లిస్టు ప్రకటించి, ఆ తర్వాత సబ్జెక్టులతో సంబంధం లేకుండా అభ్యర్థులను అక్కడే ఎంపికచేసి, వారికి నేరుగా కాల్‌లెటర్లు పంపారు. ఆ కాల్ లెటర్లు వచ్చిన అభ్యర్థులకు మాత్రమే జిల్లాలో విద్యాశాఖ అధికారులు.. సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. ఆ సమయంలో కొందరు అభ్యర్థులు తమకు ఎక్కువ మార్కులు ఉన్నా.. కాల్‌లెటర్ రాలేదని ఆందోళన చెందుతూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులు ఏ సబ్జెక్టుకు ఎంపికయ్యారో కూడా ఎవరికీ తెలీకపోవడంతో ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. ఇపుడు వాటికి చెక్ పెడుతున్నారు. ఎవరైనా అభ్యర్థి రెండు పోస్టులకు ఎంపికై ఉండుంటే ఆయనకు దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యత ఆధారంగా ఆ పోస్టుకు ఎంపిక చేసి, ఇతర పోస్టులకు ఆయా సబ్జెక్టులో అర్హత ఉన్నోళ్లకు అవకాశం కల్పించనున్నారు. ఈ డ్యూయెల్ పోస్టులకు ఇతర అభ్యర్థులను ఎంపికచేసి నేడో.. రేపో.. జిల్లాలకు జాబితా పంపనున్నారు. ఆ మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఈఓలతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు రాజధానిలో సమావేశం నిర్వహించారు. పరిశీలనలో రిమార్కులు, రిజెక్టు అయిన వారి సమాచారం తెలుసుకున్నారట. దీనిపై క్లారిటీ రావడంతో ఇక కటాఫ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి, జాబితా విడుదలకు మార్గం సుగమమైందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

- ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జీ


మాట్లాడుతున్న వలవల మల్లికార్జునరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు(బాబ్జీ) పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విజయనగర లా కాలేజి సెమినార్ హాల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా కార్మికశాఖ అధికారులతోపాటు భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు వలవల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డు అన్నిరకాల చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీ నరసయ్య, శ్రీ సత్యసాయి జిల్లా సహాయ కమిషనర్ శ్రీకాంత్ నాయక్, ధర్మవరం సహాయ కమిషనర్ సూర్యనారాయణ, అనంతపురం ఉపకమిషనర్ లావణ్య, కార్మికశాఖ అధికారులు, సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ సమాఖ్య ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్-11, 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి సంబంధించి 2015 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండి 3, 4, 5 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. అండర్-14కు 2025 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నవారు అర్హులన్నారు. అండర్-17కు 2009 జనవరి 1వతేదీ తరువాత జన్మించి, 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. అండర్-17కు 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించి 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రాప్తాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా రాప్తాడులోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. గృహహింస, లైంగిక వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలకు అందించే సేవల గురించి వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

అనంతపురం విద్య, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ఈనెల 10న స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధి నారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2024-25లో కనీసం 75శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు పాల్గొనవచ్చన్నారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ద్వారా హెచ్‌సీఎల్ టెక్‌బీ, ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం కింద ఐటీ పరిశ్రమలోకి వెళ్లే అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

గుత్తి కోట ట్రెక్కింగ్

గుత్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుత్తి కోటపై అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ టీం ఆధ్వర్యంలో సోమవారం ట్రెక్కింగ్ నిర్వహించారు. అడ్వెంచర్ టీంకు స్థానిక గుత్తికోట సంరక్షణ సమితి నాయకులు ఘనస్వాగతం పలికారు. గుత్తికోటలోని కట్టడాలను పరిశీలించి నివేదికను జిల్లా టూరిజం శాఖ, కేంద్ర పురావస్తు శాఖకు అంద జేస్తామని టీం సభ్యులు ఈశ్వర్, మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, నాగరాజు, సుధాకర్ నాయుడు, జిలాన్, నిజాం పాల్గొన్నారు.


గుత్తికోటను ఎక్కేందుకు వచ్చినవారితో సంరక్షణ సమితి ప్రతినిధులు

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ నాయకుల మండిపాటు
- కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందంటూ సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మండిపడ్డారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు సోమవారం రైతులతో కలిసి స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా చూసినా యూరియా కోసం రైతులు బారులు తీరడం చూస్తుంటే ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందన్నారు. అధికారపార్టీ అండదండలతో యూరియాను ఏజెన్సీలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాయని, అందువల్లే రైతులకు యూరియా కష్టాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. యూరియాను తరలించిన డిస్ట్రిబ్యూటర్లతోపాటు అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి రైతులకు ఎరువులను సకాలంలో అందించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, శ్రీరాములు, రమణయ్య, కృష్ణుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పీఎఫ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఉప లోకాయుక్త రజని



హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఉప లోకా యుక్త పి.రజని సోమవారం సూచించారు. గతంలో జలవనరుల శాఖ పరిధిలోని హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో రూ.27 లక్షలు పీఎఫ్ సొమ్ము స్వాహా కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు ఇలా..

హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో 2021 మార్చి నెలలో ఉద్యోగ విరమణ పొందిన డీఈ రామసంజన్న జీపీఎఫ్ ఖాతా నుంచి రూ.17.14లక్షలను జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ నకిలీ ఐడీలను సృష్టించి, పెనుకొండలోని ఓ ప్రైవేటు ఏజెన్సీ ఖాతాలో జమ చేశాడు. ఈ మొత్తాన్ని కర్ణాటక రాష్ట్రం తుమకూరులోని ఓ బ్యాంకులో డ్రాచేశారు. ఇందులో రూ.15లక్షలు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని బినామీ ఖాతాదారుడికి అందజేశారు. రూ.15లక్షల్లో రూ.10లక్షలతో బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం.

- మరో కేసులో జేఈ జీపీఎఫ్ రూ.10లక్షలను, పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి బ్యాంకులోని బినామీ ఖాతాలో జమచేశారు. అక్కడ కూడా బినామీ చేత డ్రా చేయించి, స్వాహా చేశారు. వీటిపై అప్పట్లో హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు నిందితుడైన ప్రవేశ్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేసి బకాయిలపై 7.1శాతం వడ్డీని చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పట్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేసిన కె వెంకటరమణారెడ్డి, ఎ వెంకటసురేష్ బాబు, అప్పటి సూపరింటెండెంట్లు పీఎండీ ఉస్మాన్, కె సుబ్రహ్మణ్యంలతో పాటు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రవేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. ఫిర్యాదుదారుల సమస్యను పరిష్కరించడం, బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ, ఆర్థిక శాఖల ప్రధాన కార్యదర్శుల తక్షణ స్పందన పట్ల ఉపలోకాయుక్త రజని అభినందనలు తెలిపారు. నిర్లక్ష్యం, మోసం కారణంగా ఏ ఉద్యోగి కష్టపడి పొదుపు చేసిన సొమ్ము కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.


క్రేన్ సాయంతో గేదెను బావి నుంచి బయటకు తీస్తున్న సిబ్బంది

హమ్మయ్యా..! బతికిపోయా..!!

మేత మేస్తూ ఓ పాడి గేదె ప్రమాదవశాత్తు బావిలో పడింది. అందులో నీళ్లు ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కానీ బయటకు వచ్చే మార్గం కాన రాక ఆ గేదె నీళ్లలోనే ఈదుకుంటూ ఉండిపోయింది. కాసేపటి తర్వాత రైతు గేదె కోసం వెతకగా బావిలో కనిపించింది. దీంతో ఆయన గ్రామస్థుల సాయంతో క్రేన్‌ను తెప్పించారు. దాని ద్వారా తాళ్లను కట్టి గేదెను ఒడ్డుకు చేర్చారు. గేదెను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసినట్లు రైతు కత్తే తిమ్మన్న తెలిపాడు. ఈ సంఘటన మండలంలోని కత్తే కొట్టాల గ్రామంలో సోమవారం జరిగింది.

- ధర్మవరంరూరల్, ఆంధ్రజ్యోతి

షెడ్డుపైకి దూసుకెళ్లిన లారీ

- సెక్యూరిటీ గార్డు దుర్మరణం


మస్తాన్ (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ సమీపాన సోమవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి రేకులషెడ్డుపైకి దూసుకెళ్లింది. అందులో నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డు మస్తాన్(50)పై వెళ్లడంతో అతడు దుర్మరణం చెందాడు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మస్తాన్ హైవే పనుల వద్దకు సెక్యూరిటీ గార్డుగా వెళ్తుండేవాడు. అందులో భాగంగా ఆదివారం రాత్రి బుగ్గ సమీపాన రోడ్డు పనులు చేపడుతున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులో నిద్రించాడు. తెల్లవారుజామున బనగానపల్లి వైపు నుంచి తాడిపత్రికి వస్తున్న లారీ అదుపుతప్పి షెడ్డుపై దూసుకెళ్లింది. అందులోని మస్తాన్‌పై లారీ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి


సురేష్ (ఫైల్)

కణేకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామనగర్ క్యాంపు వద్ద పొలంలో టీడీపీ కార్యకర్త సురేష్(24) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ గ్రామానికి చెందిన సురేష్ టీడీపీలో చురుకైన కార్యకర్త. ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుండేవాడు. సోమవారం సీతారామనగర్ క్యాంపు వద్ద సోమనాథ్ అనే రైతు పొలంలో విద్యుత్ మరమ్మత్తులు చేస్తుండగా.. ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. సురేష్‌కు ఆరునెలల క్రితం పవిత్రతో వివాహమైంది సురేష్ మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పాముకాటుతో బాలిక..

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడిమేపల్లికి చెందిన హేమశ్రీ (6) పాముకాటుతో చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుడిమేపల్లికి చెందిన హరిజన బడిగే మల్లికార్జున, మారెక్క దంపతుల కుమార్తె హేమశ్రీ. ఈనెల 5వ తేదీన బాలికను పాము కాటు వేసింది. హుటాహుటిన కళ్యాణదుర్గం ఆర్డీటీ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మూడురోజులుగా చికిత్స పొందుతూ బాలిక సోమవారం మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మల్లికార్జునకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, బాబు ఉన్నారు. హేమశ్రీ పెద్ద కుమార్తె.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన యువతి బోయ అశ్విని అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచెర్ల గ్రామానికి చెందిన బోయ నాగరత్నమ్మ కుమార్తె సరోజను కర్నూలు జిల్లా ఆలూరికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. సరోజ కుమార్తె అశ్విని చిన్నప్పట్నుంచి పెనకచెర్లలో అమ్మమ్మ నాగరత్న వద్దే ఉంటూ చదువుకుంటోంది. నెల రోజుల క్రితం అశ్వినికి అనంతపురానికి చెందిన ఓ యువకుడితో వివాహ నిశ్చితార్థం చేసుకున్నారు. ఈనెల 5న బ్యాంకులో పని ఉందని అమ్మమ్మకు చెప్పి.. అశ్విని గార్లదిన్నెకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో నాగరత్నమ్మ.. కుమార్తె సరోజకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. తన వద్దకు రాలేదని కుమార్తె చెప్పడంతో అశ్విని కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అశ్విని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సత్యసాయి గిరి ప్రదక్షిణ



పుట్టపర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి గిరిప్రదక్షిణను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో ప్రశాంతినిలయం గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకణ చేసి పూజలు చేశారు. భక్తులు రథాన్ని లాగారు తిరిగి గణేశ్‌గేటు వద్ద ముగించారు. వృద్ధులు సైతం పాల్గొన్నారు.

చిలకం ఇంటికి రవాణా మంత్రి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న చిలకం, ఆయన తనయుడు

ధర్మవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ సన్నాహక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ధర్మవరంలోని జనసేన పార్టీ నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ఇంటికి సోమవారం వచ్చారు. ఆయనకు చిలకం మధు, ఆయన కుమారుడు జయవర్దన్‌రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. చిలకం ఇంటిలో మంత్రి సందడి చేశారు. నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సీఎం సభ విజయవంతానికి జనసమీకరణపై చిలకం మధుసూదన్‌రెడ్డితో చర్చించారు. అనంతరం మంత్రి విందులో పాల్గొన్నారు.

నేత్రదానంపై బైక్ ర్యాలీ

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విశ్వదీపా సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవార పట్టణంలో నేత్రదానంపై అవగాహన బైకు ర్యాలీ నిర్వహించారు. కదిరి గేటు నుంచి ప్రారంభమై శివానగర్, గీతానగర్, తేరుబజార్, అంజుమన్, కళాజ్యోతి, కాలేజ్ సర్కిళ్లు, ఆర్టీసీ బస్టాండ్, కొత్తపేట, గాంధీనగర్, శాంతినగర్ ప్రాంతాలలో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

'కష్టపడిన వారికి గుర్తింపు'



వలిపి శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీ గుర్తింపు ఇస్తుందన్న దానికి వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వలిపి శ్రీనివాసులను నియమించడమే నిదర్శనమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బీసీకాలనీలో సోమవారం ఆయనను టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు.

సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

బుక్కపట్నం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంలోభాగస్వామ్యంగా ఉన్న కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల చొరవ తీసుకుని సర్వీస్ రూల్స్ సమస్యను ప రిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బాలుర, బాలిక ఉన్నత పాఠశాల, అలాగే బుచ్చయ్యగారిపల్లి, సిద్దరామపురం, చెండ్రాయునిపల్లి, లింగప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలతో సభ్యత్వ నమోదు నిర్వహించారు.

ఆటోను ఢీకొన్న బస్సు- ముగ్గురికి గాయాలు

బత్తలపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పోట్లమర్రి వద్ద సోమ వారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. బత్తలపల్లి నుంచి ఆటో ధర్మవరం వెళ్తోంది. పోట్లమర్రి సమీపములో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొంది. ప్రమాదంలో గంటాపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఈశ్వరయ్య, తాడిమర్రి మండలం మద్దలచెరువుకు చెందిన వెంగళరెడ్డి, చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లికి చెందిన వరదరాజులరెడ్డి గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

ముదిగుబ్బ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఎస్‌పీ కొట్టాల వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందినట్లు పట్నం ఎస్ఐ జయరాం నాయక్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు చెందిన డ్రైవర్ మాధవ్(51) అనంతపురం వైపు నుండి వేలూరి వైపు లారీ నడుపుతున్నాడు. ఎస్ఎస్‌పీ కొట్టాల సమీపంలోకి రాగానే లారీని నిలబెట్టాడు. లారీ దిగి రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బూదలమ్మ ఆలయంలో చోరీ

ముదిగుబ్బ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూదనాంపల్లి గ్రామదేవత అయిన బూదలమ్మ దేవత గుడిలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి, అందులోని దాదాపు రూ. 30వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగుబ్బ ఎస్ఐ నాగభూషణం తెలిపారు.

నిందితుడి అరెస్ట్

గాండ్లపెంట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం మండలకేంద్రానికి చెందిన మహిళను హత్య చేసిన కేసులో నిందితుడైన ఆమె భర్త మన్సూర్‌ను అరెస్టు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. పరారీలో ఉన్న మన్సూర్‌ను మండలకేంద్రానికి సమీపంలోని ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి అరెస్టు చేశామన్నారు. మన్సూర్‌ను సీఐ నాగేంద్ర కోర్టుకు హాజరు పరిచారు.

యువకుడికి దేహశుద్ధి-పోలీసులకు అప్పగింత

కదిరిఅర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినయువకుడికి స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నల్లమాడకు చెందిన మహేష్ అనే యువకుడు ఓ మహిళకు ఫోన్‌లో అసభ్యకర పోస్టర్లు పెడుతూ వేధిస్తున్న విషయం ఆమె ఆమెకుటుంబ సభ్యులకు తెలిపింది. వారు అతడని గ్రామానికి పిలిపించి స్తంభానికి కట్టేసి, చితకబాది, పోలీసులకు అప్పగించారు. ఈ వీడియోను సోషియల్ మీడియాలో వైరల్‌గా అయింది. దీనిపై సీఐ నిరంజన్‌రెడ్డిని అడుగగా, స్థానికులు అతడిని తమకు అప్పగించారని, బాధితుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

అధ్వానంగా అంగన్‌వాడీల పనితీరు

● చిన్నారులకు సరిగా అందని పౌష్టికాహారం
● కొరవడిన పర్యవేక్షణ




మోటుమర్ల, తుంపర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో ముగ్గురే పిల్లలు ఉన్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ధర్మవరం ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అధ్వానంగా మారింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సరఫరా చేస్తున్న పౌషికాహారాన్ని కూడా చిన్నారులకు సక్రమంగా అందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టులో 230 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 110 వరకు అద్దె భవనాల్లో నడుపుతున్నారు. చాలా కేంద్రాలను ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలతోనే నడుపుతున్నారు. అలాంటి కేంద్రాలకు రోజు ఆయాలు వస్తారు తప్ప అంగన్‌వాడీ కార్యకర్తలు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు బాహాటంగానే అంటున్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం వండకుండానే, వండినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు సమాచారం. తక్కువ మంది పిల్లలు ఉన్నా ఎక్కువ మంది వస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కూరగాయలు, గ్యాస్‌సిలిండర్ల బిల్లులను ఐసీడీఎస్ ఉన్నతాధికారి మంజూరు చేసి అందులోనూ కమిషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. మండలంలోని తుంపర్తి, మోటుమర్ల, దర్శినమలతోపాటు పలుగ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు చాలా అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. మోటుమర్ల కేంద్రంలో ముగ్గురు పిల్లలు ఉన్నారని ఆయా తప్ప కార్యకర్త సక్రమంగా అందుబాటులో ఉండరని తెలుస్తోంది. తుంపర్తి గ్రామంలోని రెండు కేంద్రాలను కలిసి ఒకే కేంద్రంలో నిర్వహి స్తున్నారని, అందులోనూ ముగ్గురు పిల్లలే ఉన్నారని గ్రామస్థుల ద్వారా సమాచారం. ఆ కేంద్రాలకు ఇద్దరు కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు. వారిలో మినీ అంగన్ వాడీ కార్యకర్త మాత్రమే కేంద్రానికి రోజు వస్తారని గ్రామస్థులు ఆరోపణ. ఇవేకాక పట్టణ, మండల పరిధిలో ఐసీడీఎస్ ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తే పలు కేంద్రాల పనితీరు బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే వ్యవస్థ అధ్వానంగా తయారవుతోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొన్ని కేంద్రాలలో కార్యకర్తల పనితీరు అధ్వానంగా ఉండటంకానీ, ధర్మవరం ఐసీడీఎస్ అధికారి కార్యకర్తలతో కుమ్మక్కై బిల్లులో కమిషన్లు తీసుకుంటున్నట్టు గానీ మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో వెళ్లి అలాంటి కేంద్రాలను తనిఖీ చేస్తాం. ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

● ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

సభను విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల, కందికుంట పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర

కదిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పీఆర్‌గ్రాండ్‌లో సోమవారం ఎన్డీఏ కూటమి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ... రాక్షస పాలనను అంతమొందించి, ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిన సందర్భంగా అనంతపురంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ - సూపర్‌హిట్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఒక్క ఓటుతో రాష్ట్ర అభివృద్ధిని కోరుకున్న ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్ర భుత్వ పనిచేస్తోందన్నారు. నిత్యం ప్రజలకోసం పనిచేసే ఎమ్మెల్యే కదిరికి ఉండడంతో ఎంతో మంచిదన్నారు. ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ... సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తానని మాట తప్పిన, పింఛన్లు పెంచేందుకు ఐదేళ్లు తీసుకున్న జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపి, అదే సయమంలో కూటమిపై నమ్మకముంచి అధికారం కట్టబెట్టిన ప్రజల అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. నియోజర్గంలో బలమైన కార్యకర్తలు ఉన్నారని, అవినీతికి పాల్పడకుండా పార్టీ కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఉద్యోగాలు మొదలుకుని ఏవిషయంలో అయినా సమన్వయంగా పనిచేస్తున్నారన్నారు. పదివేల మందిని సభకు తరలిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ భైరవప్రసాద్, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీనాబాను, చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ చైర్మన్ రాజశేఖరాచారి, బాహుద్దీన్, పరిశీలకులు వాజీద్ తదితరులు మాట్లాడారు. కూటమి పార్టీల ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొట్టుపెట్టి తెలుగు మహిళల ఆహ్వానం



సభకు తరలిరావాలని బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న నిర్వహించే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని 25వ వార్డులో తెలుగుమహిళలు బొట్టుపెట్టి ఆహ్వానించారు. 25వ వార్డులోని ప్రియాంక నగర్, హమాలీకాలనీ, లక్ష్మీచెన్నకేశవపురం ప్రాంతాలలో సోమవారం టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో తెలుగుమహిళలు విజయలక్ష్మి, పుష్పలత, సుజాత, రాజేశ్వరి, రక్షిత, సుశీల, నాగమణి ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి సీఎం బహిరంగ సభకు తరలిరాలని కోరారు. నాయకులు చీమల రామాంజి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రామాంజి, చీమల సూరి, గడ్డంసూరి, అమర్, పందిపోటురవి, బీమా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఆహ్వానం

● తాడిమర్రి: సూపర్‌సిక్స్‌సభను విజయవంతం చేద్దామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నిడిగల్లు గ్రామంలో స్థానిక నాయకుడు కాకర్ల చంద్రశేఖర్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు.

భారీగా తరలిరండి: నాయకులు

అమడగూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 10న జరిగే సీఎం బహిరంగ సభకు మండలంలోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, జనసైనికులు తరలిరావాలని సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు నరేష్ కోరారు. ఆయన సోమవారం మండలంలోని మహమ్మదాబాద్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు సిద్దు, భాస్కర్, డీలర్ నారాయణస్వామి, పాల శీనా, గాండ్ల శీనప్ప, బాబా, రవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: సూపర్ హిట్ సభను జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, చినగాని నరసింహ యాదవ్, వినోద్ బాబు, రవి, ఆనంద్, సాంబ, జయప్రకాష్, శివయ్య, సూర్యశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: సీఎం సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నరసింహులు పేర్కొన్నారు. వారు సోమవారం మండలంలోని వంకమద్ది పంచాయతీలోని పోరెడ్డివారిపల్లిలో రైతులతో మాట్లాడారు. కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

సభకు మహిళలు తరలిరావాలి

● పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు



సమావేశానికి వెళ్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న జరగనున్న సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభకు మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు నిచ్చారు. పట్టణ సమీపంలోని చిగిచెర్ల రోడ్డులో ఉన్న పద్మావతి కల్యాణమండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్, ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి సీఎం సభను విజయవంతం చేద్దామన్నారు. ప్రతి గ్రామం, వార్డులోని ప్రతి కుటుంబం నుంచి ఒక్కొక్క మహిళ హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. సీఎం సభకు వచ్చే ప్రతి ఒక్కరికి భోజనం, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పురుషోత్తంగౌడ్, భీమనేనిప్రసాద్‌నాయుడు, గొట్లూరు శీన, విజయసారథి, అమరా సుధాకర్ పాల్గొన్నారు.

● నల్లమాడ సీఎం చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు

● ఓబుళదేవరచెరువు: సూపర్ హిట్ సభను జయప్రదం చేయాలని జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండబోయిన సతీష్ కోరారు. వారు సోమవారం విలేకరులతో మా ట్లాడుతూ... కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చట్ట పరిధిలో ఉన్నవాటికి సత్వర న్యాయం: డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిస్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించి చట్టపరిధిలో ఉన్న వాటికి పరిష్కారం చూపుతామని మహిళాపోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పీజీఆర్ ఎస్‌ను నిర్వహించారు. ఫిర్యాదుదారుల నుంచి డీఎస్పీ 65 ఫిర్యాదులను స్వీకరించారు.

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

తనకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో చౌకధాన్యపు డిపో బియ్యాన్ని సీఎస్‌డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ అశోక్ చక్రవర్తినాయుడు నాలుగురోజుల క్రితం పట్టుకున్నారు. వారికి బియ్యం విక్రయించిన వారిపై ఇప్పటివ రకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

● ఎరువులను అందుబాటులో ఉంచాలి
● సీపీఐ నాయకుల డిమాండ్



కదిరిలో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రైతులకు యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందడంలేదంటూ సీపీఐ నాయకులు సోమవారం పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు తమ ప్రభుత్వమే పెద్దపీట వేస్తుందని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతుల సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలకు నాణ్యమైన విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. మోటార్లకు స్మార్టు మీటర్లు బిగించే ప్రక్రియలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీ పీఐ నాయకులు పవన్, కదిరప్ప, లియాకత్, మధు, రమణ, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఆధ్వర్యంలో సోమవారం ధర్మవరంలో ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు రవికుమార్, రమణ, శ్రీనివాసులు, సకల రాజా పాల్గొన్నారు. తాడిమర్రి, ముదిగుబ్బ, గాండ్లపెంట, నంబులపూలకుంట, ఓబుళదేవర చెరువు తదితర మండలకేంద్రాల్లో సీపీఐ ఆయా మండలాల కార్య దర్శుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

'రసాయనికం'తో పంటలు విషతుల్యం

● కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిరూరల్, కొత్తచెరువు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతుండటం వలన పంటలు విషతుల్యం అవుతున్నాయని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్ఎస్‌కేలకు, సహకారం సంఘం సొసైటీలకు యూరియా, కాంప్లెక్స్, డీఏపీని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రైతులకు వాటి పంపిణీ గురించి తెలుసుకునేందుకు కలెక్టర్ సోమవారం కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లోని రైతు సేవాకేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం సమీప పొలాల్లోని మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. పరిమితికి మించి యూరియాను వాడటం వలన పంట విషతుల్యమై, ప్రజలు బారినపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

'అందుబాటులో యూరియా'



తాడిమర్రిలో ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాడిమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు ఆరు టన్నుల యూరియా, మూడు టన్నుల కాంప్లెక్స్, మూడు టన్నుల డీఏపీ సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. ఆయనతో కలిసి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం తాడిమర్రి రైతుసేవా కేంద్రంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. యూరియా అత్యవసరంగా కావాల్సిన రైతులు ఇక్కడికి వచ్చి తీసుకోవచ్చన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు త్వరలో ఎరువులు వస్తాయని వారు తెలిపారు.

● నల్లమాడ: మండలంలోని ఎర్రవంకపల్లి, నల్లమాడ సచివాలయాల్లో రైతులకు టోకన్ పద్ధతిలో సోమవారం యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ మహమ్మద్ హక్ తెలిపారు. వరి పంట సాగుచేసిన రైతులు టోకన్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో యూరియా తీసుకోవాలన్నారు. ఎరువుల పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని బాలసముద్రం సచివాలయం పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. 70మంది రైతులకు 140 బస్తాల యూరియాను అందించారు. తహసీల్దార్ షాబుద్దీన్, ఏఓ భారతి, మాజీ సర్పంచ్ గోవిందు, సోంపాల్యం నాగభూషణం, మల్లిపూల రవి, పోరేమహేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఏడీఏ సనావుల్లా హెచ్చరించారు. ఆయన సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సు తీసుకున్న గిడ్డంగి లోనే నిల్వ ఉంచాలని సూచించారు. అనంతరం అగ్రిక ల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. రెండు, మూడు రోజుల్లో ఓడీసీ 1, ఇనగలూరు, వెంకటాపురం, అల్లాపల్లి రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తుందన్నారు.

● బత్తలపల్లి: మండలంలోని రామాపురం రైతుసేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీ చేశారు. తహసీల్దార్ స్వర్ణలత ఏఓ ఓబిరెడ్డితో కలసి పరిశీలించారు. మండలంలో రైతులకు కావల్సినంత యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు.

జ్వర పీడిత గ్రామాల్లో డీఎంహెచ్ఓ పర్యటన

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విషజ్వరాలతో బాధపడుతున్నారు. సక్రమంగా వైద్యమందక వారు ఇబ్బందులు పడుతున్న విషయంపై సోమవారం 'వదలని జ్వరం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, వైద్య బృందం జ్వర పీడిత గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటా సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి సేవలందించారు. మహమ్మదాబాద్‌క్రాస్, రామి రెడ్డిపల్లి, బొడెద్దులవారిపల్లి, మండలకేంద్రంలోని బీసీకాలనీల్లో ఆమె సందర్శించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పారిశుద్యంలోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆబేట్ స్ప్రేచేయించారు. కేజీబీవీ, జిల్లాపరిషత్ పాఠశాల, ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో ఆశకార్యకర్తలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సునీల్, వైద్యులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల విడుదల

ధర్మవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంటలకు ఎరువుల కొరతపై మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కేతిరెడ్డి కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

భూసేకరణ చట్టం బుక్‌లెట్ల విడుదల


బుక్‌లెట్లను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

రొద్దం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 2013 భూసేకరణ చట్టం బుక్‌లెట్స్‌ను విడుదల చేశారు. సోమవారం గ్రామ చావిడిలో ఏపీ రైతు సంఘం నాయకులు భూరక్షణ కోసం ప్రజలు ఏం చేయాలనే విషయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు మూడు పంటలు పండే సారవంతమైన భూములను అభివృద్ధి పేరుతో చిన్నకారు రైతుల నుంచి లాక్కుంటోందని విమర్శించారు. భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాస కల్పన కల్పించాల్సింది ప్రభుత్వమేనన్నారు. బలవంతంగా రైతుల నుంచి భూములను లాక్కుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ఫక్రుద్దీన్, హమాలీ గోపాలప్ప, రుద్రప్ప, వెంకటరాముడు, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

కుల వివక్షపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామంలో ఎస్సీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్ మారుతికి సోమవారం వినతిపత్రం అందించారు. వానవోలు గ్రామంలో 120 ఎస్సీ కుటుంబాలున్నాయని వారు తెలిపారు. గ్రామంలోని మూడు బార్బర్ షాపుల్లో వారికి కట్టింగ్, సేవింగ్ చేయకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అలాగే హోటళ్లలోనూ భోజనం పెట్టకుండా, గ్రామంలోని నాగుల కట్ట వద్ద ఎస్సీలు కూర్చోకుండా అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. పరిశీలించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణ కోరారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రవి, అక్కులప్ప, నరసింహులు, జయరాములు, నాగరాజు, నగేష్, ప్రజలు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయించండి


పంచాయతీ అధికారికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

సోమందేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినాయక నగర్‌లో ఉన్న చేతిపంపులను మరమ్మతు చేయాలని సోమవారం నాయకులు నీరుగంటి చంద్ర, వడ్డె సూరీ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారి రామాంజనేయులుకు వినతిపత్రం అందించారు. కొన్నిరోజులుగా చేతిపంపు పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


డైరెక్టర్ శ్రీదేవిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన శ్రీదేవిని టీడీపీ నాయకులు సోమవారం సన్మానించారు. టీడీపీలో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయనడానికి శ్రీదేవి వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికవడమే నిదర్శనమని నాయకులు అన్నారు. మహిళలకు టీడీపీలో పెద్దపీట వేస్తుండటంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సన్మానించిన వారిలో ఖాదీ బోర్డు మాజీ డైరెక్టర్ పాపన్న, హిందూపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం నాయకులు రజనీకాంత్, మల్లిరెడ్డి, వెంకటేశులు, గంగాధర, నరేంద్ర ఉన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి..

లేపాక్షి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయురాలు కేఎన్ ఇందిరమ్మను సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ నాగరాజునాయక్ మాట్లాడుతూ ఆమె బోధించిన పాఠాలు, నేర్పిన క్రమశిక్షణ తమకు భవిష్యత్తులో ఉపయోగపడిందన్నారు. ప్రతి ఎంఈఓ2 కుళ్లాయప్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోనాపురంలో రోడ్డు ఆక్రమణ

● పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు కోనాపురంలో రోడ్లను ఆక్రమిస్తున్నా సంబంధిత నగర పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని సచివాలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు 14 అడుగుల రోడ్డు ఉంది. గ్రామంలో ఒకరిని చూసి మరొకరు ఇళ్లముందు రోడ్డును ఆక్రమించి ఆపై ర్యాంప్‌లు ఏర్పాటుచేసుకుని దేవాలయానికి వెళ్లేదారిని ఆక్రమించారు. దీంతో ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లాలంటే గ్రామస్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంజనేయస్వామి ఆలయానికి ఆటోకూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డును ఆక్రమించుకుని రోడ్డుపైనే ర్యాంపులు, గోడలుకట్టేశారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నగర పంచాయతీ అధికారి సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఇదివరకే నా దృష్టికి వచ్చిందని త్వరలో పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.


ఏడు అడుగులకే కుంచించుకుపోయిన 14 అడుగుల రోడ్డు

అభివృద్ధిని ప్రజలకు తెలపాలి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

గోరంట్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు తదితర అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడమే ధ్యేయంగా పనిచేయాలని మంత్రి సవిత సూచించారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. పరిశీలకులుగా జీవీ ఆంజనేయులు, నరసింహరాయల్ హాజరయ్యారు. ప్రభుత్వం ఎంత అభివృద్ధి చేసినా ప్రతిపక్షాలు విషం చిమ్మే ప్రయత్నంచేస్తున్నాయని మంత్రి అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ 10న అనంతపురంలో జరుగుతోందని, సభకు సీఎం, డిప్యూటీ సీఎం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కూటమి నాయకులు బాలక్రిష్ణ చౌదరి, లక్ష్మీనారాయణ, సంతోష్, సోముశేఖర్, నాగేనాయక్, పచ్చ అశోక్, నిమ్మల విద్యాధరణి, చంద్ర, శ్రీధర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, రమణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌హిట్ సభను విజయవంతం చేద్దాం

పెనుకొండ టౌన్: సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అనంతపురంలో బుధవారం భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారురాజు, మాధవనాయుడు, మాజీ జడ్పీటీసీ


పరిగిలో మాట్లాడుతున్న మంత్రి సవిత

నారాయణస్వామి, గుట్టూరు శ్రీరాములు, టైలర్ ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, కన్వీనర్ శ్రీరాములు, నారాయణస్వామి, నాగార్జున, రమణమ్మ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను సీఎం చేసిన ఘనత పరిగిదే..

పరిగి(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నందమూరి తారకరామారావును ముఖ్యమంత్రిని చేసిన ఘనత పరిగి మండలందేనని మంత్రి సవిత అన్నారు. సోమవారం బీరలింగేశ్వర కళ్యాణమండపంలో కన్వీనర్ గోవిందరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అనంతపురంలో బుధవారం సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. అబ్జర్వర్ నరసింహారావు, సర్పంచ్ బాలాజీ, జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, ఏపీలైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్, వడ్డె హనుమయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

అమరాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సీఎం చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం సోమవారం మండల కన్వీనర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో భాగంగా 10న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అనంతపురం విచ్చేస్తున్నారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు పంచాయతీల్లో బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, నాగరాజు, నరసింహమూర్తి, మారుతిప్రసాద్, దాదాపీర్, సర్పంచ్ లోకేష్, చెన్నప్ప, కుమారస్వామి పాల్గొన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలతో సోమవారం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో భాగంగా 10న అనంతపురంలో సీఎం చంద్రబాబు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, శ్రీనాథ్, మంజునాథ్, దుర్గేష్, శివకుమార్, ప్రకాశ్, నారాయణప్ప, నజీర్, అహ్మద్ జయరామప్ప, బాదిపల్లి అప్ప, పురుషోత్తం, నాగరాజు పాల్గొన్నారు.

రొద్దం(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమానికి మండలంలోని ప్రతి సంఘం సభ్యురాలు తరలిరావాలని ఎంపీడీఓ రాంకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం


రొద్దంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంకుమార్

స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఐకేపీ గ్రామైఖ్య సంఘం లీడర్లు, యానిమేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తుందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లను ఐకేపీ సీసీలు, యానిమేటర్లు తీసుకోవాలన్నారు. ఐకేపీ ఏపీఎం జయచంద్ర, వెలుగు సీసీలు, యానిమేటర్లు, గ్రామైఖ్య సంఘం లీడర్లు పాల్గొన్నారు.

సోమందేపల్లి: అనంతపురంలో 10న జరిగే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ విజయోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నాయకులు ప్రసంగించారు. నాయకులు ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప, భానుకీర్తి, శ్రీరాములు, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పావగడ తహసీల్దార్‌గా రవి

పావగడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పావగడ తహసీల్దార్‌గా వై.రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న తహసీల్దార్ వరదరాజు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో చిక్కబళ్లాపురంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని ఇక్కడ నియమించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయరాదని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న పీపీపీ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. చంద్రశేఖర్, అరవింద్, కిరణ్, ఎస్ఎన్ గణేష్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రొళ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అవినకుంటలో ఉన్న కస్తూర్బా జూనియర్ కళాశాలలో 6 నెలలు వృక్షశాస్త్రం బోధించుటకు అర్హులైన మహిళా అభ్యర్థులు 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల స్పెషల్ ఆఫీసర్ మున్వర్‌జాన్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా వివరాలతో కేజీబీవీ కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ప్రయోగాలు.. సమాజానికి ఉపయోగపడాలి

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రయోగనమూనాలు సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయించాలని డీవైఈఓ జాన్ రెడ్డప్ప సూచించారు. సోమవారం చిన్మయ విద్యాలయంలో పెనుకొండ డివిజనల్‌స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుపై శిక్షణ సైన్స్ గణిత ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలనే దానిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గైడ్‌చేసి పంపించే ప్రయోగ నమూనా వినూత్నంగా ఉండాలన్నారు. ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, తనూజ్‌కుమార్, మనోజ్‌కుమార్, సచింద్ర పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై సీపీఐ నిరసన


గోరంట్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని, యూరియా పక్కదారి పండుతోందని సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇవ్వాలని, రుణమాఫీ చేయాలని, 50యేళ్ల నిండిన రైతులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలస్వామి, వెంకటేష్, కృష్ణ, ఆంజనేయులు, మనోహర్, కమాల్‌బాషా, సురేష్‌బాబు, మహేష్ పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన మేరకు యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. చలపతి, ఇస్మాయిల్, మారుతిరెడ్డి, రవికుమార్, బాబు, సమీవుల్లా పాల్గొన్నారు.

సోమందేపల్లి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా, డీఏపీ ఎరువులు రైతులకు సరిపడా అందించాలని కోరుతూ పక్కదారి పడుతున్న యూరియాను నియంత్రించి రైతులకు అందించాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ రైతులకు పంట సహాయాన్ని ఒకేవిడతలో అందించాలన్నారు. జిల్లా నాయకులు బాలస్వామి, మండల కార్యదర్శి రాజగోపాల్, సహాయ కార్యదర్శులు చాంద్‌బాషా, అంజినమ్మ, సభ్యులు గంగరాజు, చిల నారాయణస్వామి, బాబాజాన్, నూర్‌జహాన్, ఆంజనేయులు పాల్గొన్నారు.


డీటీ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సకాలంలో రైతులకు యూరియా

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులకు యూరియాను అందించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వ్యవసాయాధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని నాగలూరు గ్రామ రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. అక్కడ రైతులతో పంట స్థితిగతులపై ఆరాతీశారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ చందన, ఏఈఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

● మడకశిర రూరల్: యూరియాపై రైతులు ఇందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి తిమ్మప్ప తెలిపారు. మండలానికి సంబంధించి యూరియా ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సోమవారం గుండుమల రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గుండమల మాజీ సర్పంచు చంద్రప్ప రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● గుడిబండ : రైతులకు ఎరువులు కొరత రానివ్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి అన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఏఓ వీరనరేష్‌తో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తప్పిదాల వల్లే ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, వీవో వీరనరేష్, రైతులు పాల్గొన్నారు.

●రొళ్ల : స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను మండలంలోని రైతులకు సోమవారం మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మంతో కలిసి మండల టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, భరత్, నాగేంద్ర, రామక్రిష్ణ, రవి పాల్గొన్నారు.

●లేపాక్షి : డివిజన్ పరిధిలో ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం కల్లూరు ఆర్బీకేలో ఎరువుల పంపిణీని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ యూరియా కొరత లేదని కొంతమంది పుట్టించే పుకార్లు నమ్మవద్దన్నారు. అనంతరం యూరియాను సరఫరా చేశారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


యూరియా పంపిణీ చేస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్


ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

భగవంతుడి సేవకు మించినది ఏదీలేదు

● టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భగవంతుని సేవకు మించిందేది లేదని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పేట వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా భగీరథ నవీన్‌చంద్ర, తొమ్మిది మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేట వెంకటరమణస్వామి ఆలయ కమిటీలో చైర్మన్, సభ్యులుగా అవకాశం దక్కడం అదృష్టమన్నారు. భగవంతునిపట్ల సేవ చేయాలన్న సంకల్పం ఉన్నవారే నిజమైన భక్తులన్నారు. ఆలయ అధికారులు చైర్మన్, కమిటీ సభ్యులు మాల, రాము, చిరంజీవి, వెంకటశ్రీనివాసులు, రామిరెడ్డి, వెంకటరత్నమ్మ, శ్రావణసంధ్య, వెంకటాచలపతి, సరోజ, ఎక్స్‌అఫిషియోమెంబర్ రామాయణం చరణ్ ప్రమాణస్వీకారం చేశారు. వీరిని సత్కరించారు. ఆలయ ఈఓ నరసింహమూర్తి, మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, పట్టణ కన్వీనర్ వెంకటేష్, నాయకులు మంగేష్, రాఘవేంద్ర, జేపీకే రాము, మంజునాథ్, పరిమళ, అంజి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాక ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి అన్నారు. సోమవారం వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివినపుడు తాము అనుకొన్న లక్ష్యం చేరుకుంటారన్నారు. అధ్యాపకులు విద్యార్థులను మంచి క్రమశిక్షణతో మెలగే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని తొలగించేవారే గురువులు

● ఎమ్మెల్యే పీఏ వీరయ్య


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పీఏ వీరయ్య

చిలమత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అజ్ఞానాన్ని తొలగించేవారే గురువులను ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై సమాజంలో గురువుల ప్రాముఖ్యతపై వివరించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల కంటే గురువు స్థానం ముందుంటుందన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారన్నారు. గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ బడులను బాగుచేసుకోవడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నౌషాద్ అలి, సుబ్రహ్మణ్యం, వనజ, నంజప్పలను శాలువాలతో సన్మానించారు. ఎంఈఓలు హనుమంతరెడ్డి, సాల్మన్‌రాజ్, నాయకులు అంజినప్ప, లక్ష్మీనారాయణ యాదవ్, గౌరీశంకర్, రంగారెడ్డి, శ్రీదేవి, నందీషప్ప, ఉపాధ్యాయులు రవి కుమార్, గోపాలరెడ్డి, అలీముల్లా పాల్గొన్నారు.

గురువులే మార్గదర్శకులు

హిందూపురం(ఆంధ్రజ్యోతి): సమాజానికి గురువులే మార్గదర్శకులని పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నందకుమార్, హెచ్‌ఎం గాయిత్రి, పాఠశాల ఏడీ స్మిత, నందిత, ఏఓ భాస్కర్, విజయేంద్ర పాల్గొన్నారు.

సాగుభూమికి పట్టాలు ఇవ్వండి


అర్జీలు సమర్పించేందుకు బారులు తీరిన రైతులు

సోమందేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగోడు పంచాయతీ సర్వేనంబరు28లో ఉన్న 1051ఎకరాల్లో కొన్నేళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంవద్ద రైతులు బైఠాయించి ధర్నా చేపట్టారు. కొన్నేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరగడమే కానీ తమకు ఎలాంటి భరోసా ఇవ్వడంలేదన్నారు. సమస్య ను మంత్రి దృష్టికి తీసుకెళితే టీడీపీ నాయకులతో కమిటీవేసి వ్యక్తిగత అర్జీలు సమర్పించాలని తెలిపారన్నారు. 300మంది రైతులు ఎకరం నుంచి మూడెకరాల దాకా సాగులో ఉన్నారన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందజేవారు. తుంగోడు పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని రైతుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

పావగడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నాలుగు మండల కేంద్రాలలో 50 ఏళ్లుగా బీడు భూములను సాగుచేస్తున్న రైతులకు చట్టబద్ధం చేసి పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ నిరుపేద రైతులు తాలుకాలోని అధిక సంఖ్యలో కలిగి ఉండి 50, 53లో ఇప్పటికే అర్జీలు దరఖాస్తు చేసుకున్నారని బగర్‌హుకుం కమిటీ కింద ఎమ్మెల్యే, తహసీల్దార్ చొరవ తీసుకుని చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. చట్టం పరిధిలో వాటిని పరిగణించి దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టాలివ్వాలన్నారు. వందలాది మంది రైతులు ర్యాలీలో పాల్గొన్నారు.